సాక్షి శ్రీకాకుళం

సోమవారం, 6, ఫిబ్రవరి, 2023



అ..అంగన్‌వాడీ

అంగన్‌వాడీల ఆధునికీకరణ జరుగుతోంది. కొత్త భవనాల నిర్మాణానికీ శ్రీకారం చుడుతున్నారు.

- 8లో



రోడ్డు ప్రమాదాల్లో..

జిల్లాలో వేర్వేరు చోట్ల రెండు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. నలుగురు గాయపడ్డారు.

- 8లో

సామూహికంగా ద్రవ జీవామృతం తయారీ

ఎచ్చెర్ల క్యాంపస్: జరజాం పంచాయతీ బట్నవానిపేటలో ఆదివారం రైతులు సామూహికంగా ద్రవ జీవామృతం తయారు చేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తయారీ విధానం వివరించి, ప్రయోజనాలను రైతులకు తెలియజేశారు. రైతులు ప్రకృతి వ్యవసాయ సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

న్యూస్‌రీల్

15 నుంచి ఈఎంయూ పరుగులు

కాశీబుగ్గ: విశాఖపట్నం–పలాస–విశాఖ ఈఎంయూ రైలు (07470/07471) ఈ నెల 15 నుంచి పునఃప్రారంభమవుతుందని ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. 2020 కరోనా లాక్‌డౌన్ కారణంగా నిలిచిపోయిన ఈ రైలు సుమారు మూడేళ్ల తర్వాత పట్టాలపైకి ఎక్కనుంది. ప్రతి రోజు విశాఖపట్నంలో ఉదయం 7.30 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1 గంటకు పలాస చేరుతుందని, 1.30కు పలాసలో ప్రారంభమై సాయంత్రం 5.30కు విశాఖ చేరుతుందని తెలిపారు.. పలాస, పూండి, రౌతుపురం, నౌపడా, దండుగోపాలపురం, కోటబొమ్మాళి, హరిశ్చంద్రపురం, తిలారు, ఉర్లాం, శ్రీకాకుళం రోడ్డు, దూసి, పొందూరు, జి.సిగడాం, బాతువలలో కేవలం రెండు నిమిషాలు మాత్రమే నిలుస్తుందని ప్రకటనలో పేర్కొన్నారు.

జాతీయ మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలకు మోహనరావు



టైటిల్ అందుకుంటున్న ఎ.మోహనరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన మాస్టర్ బ్యాడ్మింటన్ ప్లేయర్ అవదూతల మోహనరావు చరిత్ర సృష్టించారు. జాతీయ స్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు మార్చిలో గోవా వేదికగా జరగనున్నాయి. ఆమదాలవలస మండలం చింతాడకు చెందిన మోహనరావు ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు వేదికగా జరిగిన ఏపీ రాష్ట్రస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో 40+ వయో విభాగంలో సింగిల్స్ కేటగిరిలో మొదటిస్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. దీంతో జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాలో ఈ ఘనత సాధించిన మొదటి మాస్టర్ ప్లేయర్‌గా నిలిచారు. ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, జిల్లా చైర్మన్ ఆర్.రాజేంద్రన్, చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, సీఈఓ సంపతిరావు సూరిబాబు, గురుగుబెల్లి ప్రసాదరావు, శైలానీ, అనీల్‌కుమార్ తదితరులు అభినందించారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఈఓ గార పగడాలమ్మ

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఆదివారం జరిగిన నేషనల్ మెరిట్ కమ్ మీన్స్(ఎన్ఎంఎంఎస్) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా నుంచి ఎన్ఎంఎంఎస్ పరీక్షకు 5675 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం జరిగిన ఈ పరీక్షకు 5519 మంది హాజరు కాగా, 156 మంది వివిధ కారణాలతో గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని న్యూ సెంట్రల్ స్కూల్, ఏపీఎస్ఎంస్కూల్, ఎన్‌టీఆర్ ఎంహెచ్‌స్కూల్, బలగ మున్సిపల్ హైస్కూల్, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, ఆర్‌సీఎం ఇల్లీసుపురం, భాష్యం, గీతాంజలి, శ్రీచైతన్య స్కూల్ తదితర పాఠశాలలు కేంద్రాలుగా పరీక్ష జరిగింది. జిల్లా విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ పలు కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అగ్ని ప్రమాదంలో గాయపడి వృద్ధురాలి మృతి

మెళియాపుట్టి: మండలంలోని గొప్పిలి గ్రామానికి చెందిన కోట సావిత్రమ్మ (76) అగ్ని ప్రమాదంలో గాయపడి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల ఒకటో తేదీన కోట సావిత్రమ్మ గొప్పిలి గ్రామంలోని తన ఇంటి వద్ద కట్టెల పొయ్యి పై వంట చేస్తూ కళ్లు తిరిగి ఆ పొయ్యిపై పడిపోయారు. దీంతో నిప్పంటుకుని తీవ్రంగా గాయపడ్డారు. పక్కింటి వాళ్లు గమనించి ఆమెను పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. ఆమె శనివారం రాత్రి అక్కడే మృతి చెందగా.. ఆదివారం శవ పంచనామా చేశారు. ఆమె కుమారుడు ఆనందరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ నరసింగరావు తెలిపారు.

● ఉత్సవం.. ఉత్సాహం



వత్సవలస రాజమ్మ తల్లి జాతర అంగరంగ వైభవంగా మొదలైంది. శనివారం రాత్రికి వచ్చిన భక్తులు ఆదివారం వేకువ జామున సమీపంలోని సముద్రంలో స్నానాలు చేసి రాజరాజేశ్వరి దేవిని దర్శించుకున్నారు. శ్రీకూర్మం కూడలి వద్ద నుంచి తూలుగు, ఎర్ర గుడ్డి మీదుగా మరలా శ్రీకూర్మం వరకు వన్‌వే ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగలేదు. –గార

● అర్చన.. అద్భుతం

జాతీయ రహదారిని ఆనుకుని కుంచాల కూర్మయ్యపేట దేవీ ఆశ్రమంలో మాఘ పౌర్ణమి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. లక్ష చామంతులతో అమ్మవారికి పీఠాధిపతి బాలభాస్కర శర్మ పూజలు నిర్వహించారు. కుంకుమార్చన ఆకట్టుకుంది. – ఎచ్చెర్ల క్యాంపస్



● కల్యాణం..కమనీయం





శ్వేతగిరిపై ఆదివారం కాళీయమర్దన వేణుగోపాలుని కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. రుక్మిణీ సత్యభామ సమేత కాళీయ మర్దన వేణుగోపాలుని కల్యాణోత్సవంతో పాటు శ్రీలక్ష్మి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి కల్యాణం కూడా నిర్వహించారు. ఆలయ అర్చకుల సమక్షంలో శ్రీకూర్మంకు చెందిన కూర్మరాజాచార్యులు, మహేంద్రాడ వేణుగోపాలచార్యులు బృందం ఈ క్రతువు నిర్వహించింది. –గార

సిక్కోలు జీవనాడి

- జీడి పూతపై రైతుల ఆశాభావం
- జిల్లాలో సుమారు 24 వేల హెక్టార్లలో జీడి సాగు
- ఆర్‌బీకేల ద్వారా తోటబడి కార్యక్రమాలు

వజ్రపుకొత్తూరు రూరల్: జీడి రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. ఈ ఏడాది జీడి పూత ఆశాజనకంగా ఉండడంతో దీనిపై రైతులంతా ఆశలు పెట్టుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 30 మండలాల్లో సుమారు 24,080 హెక్టార్లలో జీడి సాగవుతోంది. ఇందులో అత్యధికంగా ఉద్దానం ప్రాంతంలో 15 వేల హెక్టార్లలో పంట సాగవుతుండగా సీతంపేట, భామిని, కొత్తూరు, లావేరు, రణస్థలం, మెళియాపుట్టి తదితర మండలాల్లో పండిస్తున్నారు. ఈ పంటను దాదాపుగా 2.50 లక్షల మంది రైతులు సాగు చేస్తూ జీవనోపాధి పొందుతుండగా.. మరో 3.50 లక్షల మంది కార్మికులు, వ్యాపారులు జీడి ఆధారిత పరిశ్రమలపై ఆధార పడి బతుకుతున్నారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో ప్రస్తుతం పంట చిగురు, పూత దశలో ఉంది. పరిస్థితులు అనుకూలిస్తే మంచి లాభాలు వస్తాయని రైతులంటున్నారు.

ఉద్యాన పంటలకు కేరాఫ్ ఉద్దానం

ఉద్యాన పంటలకు చిరునామాగా ఉద్దానం మారుతోంది. వజ్రపుకొత్తూరు, పలాస, మందస, సోంపేట, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండలాలను కలిపి ఉద్దానంగా పరిగణిస్తారు. ఈ ప్రాంతంలో నిత్యం కొబ్బరి, జీడి, మామిడి తదితర చెట్లు కళకళలాడుతుంటాయి. జిల్లాలోనే అత్యధికంగా ఇక్కడ జీడి పంట సాగవుతోంది. లక్షలాది మంది రైతులు, జీడి కార్మికులు, వ్యాపారులు ఈ పంటను నమ్ముకుని జీవనోపాధి సాగిస్తున్నారు. ప్రధానంగా తెల్ల బంగారంగా చెప్పుకునే పలాస జీడి పప్పుకు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేకమైన గుర్తింపు ఉండటంతో రైతులు జీడి పంట సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు.

రెండో దశ పూతతో అధిక దిగుబడి

ఏడాదిలో జీడి పంట మూడు దశల్లో పూత వస్తుంది. నవంబర్–డిసెంబర్ నెలలో మొదటి సారిగా పూత వస్తుంది. జనవరి–ఫిబ్రవరి నెలలో రెండో దశలో పూత, అలాగే మార్చిలో మరో దశ పూత వస్తుందని ఉద్యానవన శాఖాధికారులు చెబుతున్నారు. అయితే వీటిలో జనవరి–ఫిబ్రవరి నెలల్లో వచ్చే పూత మాత్రమే అనుకూలిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు అని తెలిపారు.

ఈ సమయంలో పొగమంచు, తేనె మంచు ప్రభావంతో పాటు టీ దోమ పంటకు ఆశించే ప్రమాదం ఉందన్నారు. వీటి నివారణకు పంట సాగులో యాజమాన్య పద్ధతులు, సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలన్నారు.



ఆశాజనకంగా జీడి పూత

ఏడేళ్లలో జీడి పంట దిగుబడి వివరాలు:

ఏడాది	పంట విస్తీర్ణం (హెక్టార్లలో)	దిగుబడి (మెట్రిక్ టన్నులు)
2017	24,089	8,430
2018	24,087	11,455
2019	14,500	3700
2020	20,300	11,300
2021	23,089	11,050
2022	24,080	3900
2023	24,080	....





తోటబడి కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

తోటబడితో సాయం

5 ఏళ్ల క్రితం తిత్లీ తుఫాన్ సృష్టించిన బీభత్సానికి ఉద్దానం పంటలు సర్వనాశనమయ్యాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ప్రోత్సాహంతో గణనీయంగా పంట విస్తీర్ణం పెరిగింది. దీంతో ప్రస్తుతం ఉద్దానంలో మళ్లీ పచ్చని చెట్లతో కళకళలాడుతూ పూర్వవైభవం సంతరించుకుంది. ప్రస్తుతం పంట చిగురిస్తూ పూత దశలో ఉండటంతో గ్రామ స్థాయిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్‌బీకేల ద్వారా అధికారులు తోటబడి కార్యక్రమాలు చేపట్టి రైతులకు సకాలంలో సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

వాతావరణం సహకరిస్తేనే..



పంట సాగు చేసేందుకు ఇప్పటికే వేలాది రూపాయలు ఖర్చుపెట్టాం. ప్రస్తుతానికి జీడి పూత, పిందె దశలో ఉంది. వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో పంట బాగానే ఉంది. వాతావరణ పరిస్థితులు చివరి వరకు సహకరిస్తే ఆశించిన స్థాయిలో పంట చేతికి అందుతుంది.

– వై.రాజారావు, జీడిరైతు, సీతాపురం, వజ్రపుకొత్తూరు మండలం

అధిక దిగుబడులు సాధించేలా..



జీడి పంటలో అధిక దిగుబడులు సాధించే విధంగా చర్యలు చేపడుతున్నాం. ఆర్‌బీకేల పరిధిలో తోటబడి కార్యక్రమాలు చేపడుతూ రైతులకు సకాలంలో సరైన సలహాలు, సూచనలు అందిస్తున్నాం. ఉద్యాన రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఆర్‌వీవీ ప్రసాద్, జిల్లా ఉద్యానశాఖాధికారి, శ్రీకాకుళం

శోకసంద్రంలో మండాది



మృతుల కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న డ్వామా పీడీ చిట్టిరాజు

ఆమదాలవలస రూరల్: మండలంలోని శ్రీనివాచార్యులపేట పంచాయతీ మండాది గ్రామం సమీపంలో లారీ ఢీకొని నలుగురు ఉపాధి వేతనదారులు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో మృతిచెందిన అంబటి సత్తెమ్మ, మురువందల పాపమ్మ, కురమాన లక్ష్మి, అమలాపురపు గౌరమ్మల మృతదేహాలకు ఆదివారం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించారు. స్వగ్రామంలోనే వీరి అంత్యక్రియలు జరిగాయి. నలుగురి అంత్యక్రియలు జరగడంతో ఊరంతా విషాదంలో మునిగిపోయింది.

ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం

మృతుల కుటుంబాలను డ్వామా పీడీ జీవీ చిట్టరాజు ఆదివారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను తోటి వేతనదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వపరంగా రావాల్సిన పరిహారాన్ని వీలైనంత త్వరగా వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉపాధి పనుల కోసం వెళుతున్న సమయంలో దుర్ఘటన చోటుచేసుకోవడం బాధాకరమని అన్నారు. పరామర్శలో మాజీ ఎంపీటీసీ గురుగుబెల్లి ప్రభాకరరావు, ఏపీవో లక్ష్మీనరసమ్మ, ఈసీ రాము, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

అరసవల్లిలో మాఘ మాస ప్రత్యేక పూజలు



భక్తులతో నిండిన ప్రత్యేక క్యూలైన్లు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం మాఘమాస సందడి కనిపించింది. మాఘ ఆదివారం కావడంతో రైతులు, గ్రామీణ ప్రాంత భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి వేకువజాము నుంచే ఆదిత్యుడిని దర్శించుకున్నారు. మాఘ మాస ఆదిత్యుడిని ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 5.45 గంటల నుంచే సర్వదర్శనాలు ప్రారంభమయ్యాయి. వత్సవలస రాజమ్మ యాత్రకు వచ్చిన భక్తులు కూడా ఆదిత్యుడిని దర్శించుకున్నారు. ఉచిత దర్శనంతోపాటు రూ. 100 ప్రత్యేక దర్శనం, రూ. 500ల విశిష్ట దర్శనానికి కూడా భక్తులు క్యూ కట్టారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ వి. హరిసూర్యప్రకాష్ తగు చర్యలు చేపట్టారు. ఈ ఒక్క రోజున వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాలతో రూ. 5,06,400లు, పూజలు, విరాళాల రూపంలో రూ.1,65,202లు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 3.60 లక్షలు చొప్పున ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



నిర్మల(ఫైల్)

జలుమూరు: మండలంలోని కరవంజ పంచాయతీ పరిధి మట్టవానిపేటకు చెందిన మొగిలిపల్లి నిర్మల (33) శనివారం అర్ధరాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. భర్త వేధింపులు తాళలేక ఆమె ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు సమాచారం. పోలీసులు, మృతురాలి తండ్రి రామారావు తెలిపిన వివరాల మేరకు.. నిర్మలకు పాతపట్నం మండలం కోయి కొండ గ్రామానికి చెందిన మొగులిపల్లి నందీశ్వరరావుతో 2017లో పెళ్లయ్యింది. వీరికి ఐదు, మూడేళ్ల వయసు గల ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే మగ సంతానం లేదని నందీశ్వరరావు వేధించేవాడు. చెడు వ్యసనాలకు కూడా బానిసై నిర్మలను పట్టించుకునేవాడు కాదు. తల్లీపిల్లలు మట్టవానిపేటలోనే ఉండేవారు. పిల్లలను తీసుకెళ్లాలని కోరినా నందీశ్వరరావు వినలేదని, ఆ మనస్తాపంతోనే ఇంటిలో ఉన్న శ్లాబ్‌కు ఉరి వేసుకుందని తండ్రి తెలిపారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.పారినాయుడు తెలిపారు.

జాతీయ పోటీలకు పయనం



డైరెక్ట్ నేషనల్స్‌కు ఎంపికైన అథ్లెట్స్‌తో జిల్లా అథ్లెటిక్స్ సంఘ నాయకులు, పీడీలు



శ్రీకాకుళం న్యూకాలనీ: డైరెక్ట్ నేషనల్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఆదివారం ఇక్కడి నుంచి పయనమయ్యారు. ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు బీహార్‌లోని పాట్నా వేదికగా జరిగే ఈ ఆలిండియా డైరెక్ట్ నేషనల్స్‌కు జిల్లా నుంచి రికార్డుస్థాయిలో 13 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులకు ఆదివారం శ్రీకాకుళం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రతినిధులు స్పోర్ట్స్ కిట్, క్రీడాదుస్తులను ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు పంపిణీ చేశారు. జాతీయ పోటీల్లో తుది వరకు పోరాడి పతకాలతో తిరిగిరావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి పి.సుందరరావు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ముఖ్య సలహాదారుడు నౌపడ విజయ్‌కుమార్, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఉపాధ్యక్షుడు ఎం.కామయ్య, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీవీ రమణ, పీడీ పీఈటీలు పాల్గొన్నారు. ఈ జట్టుకు కోచ్ మేనేజర్లగా పీడీలు డి.ధర్మారావు (జెడ్పీహెచ్‌స్కూల్ బిర్లంగి), ఎస్.సాజన్ (జెడ్పీహెచ్‌స్కూల్ మందరాడ) వ్యవహరిస్తున్నారు.

డుమ్మా..చెల్లదమ్మా!

- స్కూల్ పిల్లల హాజరుపై పర్యవేక్షణ
- ప్రతి రోజూ స్కూల్‌కు వెళ్లేలా మొబైల్ మెసేజ్ అలర్ట్
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



తల్లిదండ్రులకు సందేశం అందజేసే స్టూడెంట్ అటెండెన్స్ యాప్

టెక్కలి: పిల్లల స్కూల్ హాజరుపై సర్కారు ప్రత్యేక పర్యవేక్షణకు చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులంతా ప్రతి రోజూ పాఠశాలకు వెళ్లే విధంగా మొబైల్ అలర్ట్ సందేశానికి రూపకల్పన చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులంతా వంద శాతం హాజరై తద్వారా ప్రభుత్వం అందజేస్తున్న అమ్మఒడి పథకాన్ని పూర్తి స్థాయిలో అందుకోవాలనే ఉద్దేశంతో ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఇంటి నుంచి పాఠశాలకు వెళ్తున్నామని చెప్పి పాఠశాలకు చాలా మంది డుమ్మా కొడుతుంటారు. ఇలాంటి సందర్భాల్లో 'విద్యార్థి పాఠశాలకు హాజరు కాలేదంటూ' మొబైల్ అలర్ట్ సందేశం విద్యార్థుల తల్లిదండ్రులకు వెళ్లిపోతుంది. బాలికల విషయంలో ఈ విధానం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. పాఠశాల హాజరు యాప్‌లో ప్రభుత్వం కొత్తగా అమలు చేసిన 'మొబైల్ మెసేజ్ అలర్ట్' విధానంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

10.30 అయినా రాకపోతే..

విద్యార్థులు ఉదయం 10:30 గంటల లోపు పాఠశాలకు హాజరు కాకపోతే...మీ అమ్మాయి/ అబ్బాయి ఈ రోజు పాఠశాలకు హాజరు కాలేదంటూ పాఠశాల విద్యా శాఖ కమిషనర్ పేరుతో ఆయా తల్లిదండ్రులకు నేరుగా మొబైల్ సందేశం చేరవేస్తారు. దీని కోసం ముందస్తుగా విద్యార్థుల తల్లి/తండ్రి/ సంరక్షుని మొబైల్ నంబర్, ఆధార్ నంబరును సేకరించి సీఎస్ఈ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. అయితే ఇలాంటి సందేశాలు ఇప్పటి వరకు కేవలం ప్రైవేట్ పాఠశాలల్లోనే చూశాం. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అమలు చేశారు. వరుసగా మూడు రోజుల పాటు పాఠశాలకు హాజరు కాకపోతే.. తల్లిదండ్రులతో పాటు ఆ ప్రాంతం గ్రామ వలంటీర్, సచివాలయం వెల్ఫేర్ సహాయకుడికి ఈ మెసేజ్ చేరవేస్తారు. దీంతో గ్రామ వలంటీర్, వెల్ఫేర్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయుడు కలిసి విద్యార్థి ఇంటికి వెళ్లి విద్యార్థి పాఠశాలకు ఎందుకు రావడం లేదనే విషయాన్ని తెలుసుకోవాలి.

మంచి విధానం



విద్యార్థులు పాఠశాలకు వెళ్లకపోతే వారి తల్లిదండ్రుల ఫోన్‌కు సమాచారం అందజేసే విధానం ఎంతో మంచిది. దీని వల్ల విద్యార్థులు వంద శాతం పాఠశాలకు హాజరవుతారు. కొన్ని సందర్భాల్లో విద్యార్థి పాఠశాలకు వెళ్లకుండా ఉంటే తల్లిదండ్రులకు వెంటనే తెలుస్తుంది. బాలికల విషయంలో ఈ విధానం ఎంతో ఉపయోగం. ప్రభుత్వం ఇప్పటికే విద్యా వ్యవస్థలో ఎన్నో మంచి మార్పులు తీసుకువచ్చింది. ఇప్పుడు ఈ విధానం ఎంతో ఉపయోగకరం.

– గోపినాథ్ బెహరా, విద్యార్థి తండ్రి, టెక్కలి

పూర్తి స్థాయిలో హాజరవుతారు



ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు ప్రభుత్వం ఆన్‌లైన్ అటెండెన్స్ అమలు చేశారు. ఇప్పుడు విద్యార్థులు పాఠశాలకు వెళ్లకపోతే వారి తల్లిదండ్రులకు సందేశం వెళ్లే విధంగా కొత్త విధానం తీసుకువచ్చారు. దీని వల్ల పాఠశాలలో ప్రతి రోజూ హాజరు శాతం మెరుగవుతుంది. విద్యార్థులు పాఠశాలకు రాకుంటే ఎందుకు రాలేదని విషయాన్ని వెంటనే తెలుసుకోవచ్చు. – జి.పగడాలమ్మ, జిల్లా విద్యా శాఖాధికారి

క్లుప్తంగా

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని అక్కవరం గ్రామ జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. టెక్కలి ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పాత నౌపడలో వీఆర్‌వోగా పనిచేస్తున్న ఇ.నాగరాజు వ్యక్తిగత పనుల నిమిత్తం అక్కవరం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి జాతీయ రహదారిపై వ్యతిరేక మార్గంలో వస్తుండగా అదే సమయంలో పలాస నుంచి శ్రీకాకుళం వైపు బి.కామేశ్వరరావు తన ద్విచక్ర వాహనంపై వెళ్తూ పరస్పరం ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని పెద్దబమ్మిడి వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదం ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసన్నపేట నుంచి టెక్కలి వెళ్తున్న ఆటోను గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న టెక్కలి మండలం కొనుసులకొత్తూరుకు చెందిన మెట్ట శాంతారావు, టెక్కలికి చెందిన కోరాడ మోహనలకు గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో కోటబొమ్మాళి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు.

కరాటే పోటీల్లో సోనియాకు రజతం



రజత పతకంతో సోనియా

పాతపట్నం: విశాఖపట్నంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో తైక్వా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 6వ ఇంటర్‌నేషనల్ కరాటే చాంపియన్‌షిప్–2023లో 56 కేజీల విభాగంలో పాతపట్నం శివశంకర్ కాలనీకి చెందిన నల్ల సోనియా రజత పతకం సాధించింది. ఏపీతో పాటు తెలంగాణ, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాలు పాల్గొన్న ఈ పోటీల్లో సత్తాచాటడంతో జాతీయ స్థాయి పోటీలకు సైతం ఎంపికైంది. కరాటేతో పాటు కుస్తీ పోటీల్లోనూ సోనియా ప్రతిభ చూపుతోంది. హిరమండలంలోని సుభలయకు చెందిన కరాటే శిక్షకుడు సింహాచలం వద్ద శిక్షణ పొందినట్లు సోనియా తెలిపారు.

పర్సు అందజేత



పర్సు అందజేస్తున్న డీఎం కె.మాధవ్

శ్రీకాకుళం అర్బన్: ఎచ్చెర్ల మండలం కొంగరాం గ్రామానికి చెందిన రావాడ పాపారావు ఆదివారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పర్సు జారవిడుచుకున్నాడు. ఆర్టీసీ కానిస్టేబుల్ పల్లి రామకృష్ణకు పర్సు దొరకడంతో స్టేషన్ మాస్టర్ వి.శామ్యూల్‌కు అందజేశారు. ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌కు పర్సులోని ఆధార్ కార్డు వాట్సాప్‌లో పంపించగా సిబ్బంది కొంగరాం సర్పంచ్ గుండ రవికుమార్‌కు జరిగిన విషయం వివరించారు. వెంటనే పాపారావుకు సమాచారం తెలియజేయగా కాంప్లెక్స్‌కు వచ్చి శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్ ద్వారా పర్సు తీసుకున్నారు. పర్సులో రూ.8,900 నగదు, ఏటీఎం కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, వెహికల్ ఆర్‌సీ తదితరవి ఉన్నాయి.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కె. 10గ్రా.)	54,930–00
బంగారం(22కె. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215

సందడిగా ఉపనయనాలు





మేజరు పంచాయతీ నరసన్నపేటలో ఆదివారం సత్యనారాయణ స్వామి, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో వైష్ణవ, శివ మతస్తుల సామూహిక ఉపనయనాలు సందడిగా నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన వైష్ణవ, శివ మతానికి చెందిన 220 మంది కళింగకోమటి యువకులు తరలిరావడంతో ఆలయాల్లో సందడి వాతావరణం నెలకొంది. స్థానిక కళింగ కోమట్ల సంఘం ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. – నరసన్నపేట

ఆటవిడుపు



రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు కాసేపు చిన్నపిల్లాడిలా మారిపోయారు. కలెక్టరేట్ సమీపంలో ఆదివారం ప్రారంభించిన 'నరసింహారావు చిల్డ్రన్ పార్కు'లో చిన్నారుల వ్యాయామ యంత్రం ఎక్కి సందడి చేశారు. – శ్రీకాకుళం(పీఎన్ కాలనీ)

భుజంపై నాగలి.. అభినవ బాహుబలి



కరోనా కారణంగా తెరమరుగైన జీవన భృతి కళలు మళ్లీ తెరపైకి వస్తున్నాయి. ఫరీదుపేటలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. నాగలిని భుజంపై ఉంచడం, దంతాలతో నిలబెట్టడం వంటి విన్యాసాలు అలరించాయి. – ఎచ్చెర్ల క్యాంపస్

అ.. అంగన్‌వాడీ ఆ.. ఆధునికీకరణ



ఇచ్ఛాపురం మండలం మండపల్లి-3లో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం

- రెండో దశలో 138 అంగన్‌వాడీ స్కూల్స్ నిర్మాణం
- ఒక్కో స్కూల్‌కు రూ.16లక్షలు నిధులు మంజూరు
- పాత వాటికి మరమ్మతులు, మౌలిక సదుపాయాల పెంపు



కంచిలి మండలం డి.జి.పురంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం

శ్రీకాకుళం అర్బన్: నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలను బాగు చేసిన వైఎస్సార్ సీపీ సర్కారు.. అంగన్‌వాడీలపై దృష్టి పెట్టింది. చిన్నారుల భావి జీవితానికి బాటలు వేయడంలో అంగన్‌వాడీలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఎనలేని సేవలు అందిస్తున్నాయి. అందుకే కొత్త అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన భవనాల నిర్మాణం, పాత భవనాల మరమ్మతులు, సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులు కేటాయించింది.

138 కేంద్రాల నిర్మాణం

జిల్లా వ్యాప్తంగా రెండో దశలో 138 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం కోసం ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. ఒక్కో స్కూల్‌కు రూ.16లక్షలు కేటాయించింది. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా మరమ్మతు చేయాల్సిన అంగన్‌వాడీలను కూడా గుర్తించారు. 144 అంగన్‌వాడీలను బాగు చేయాలని నిర్ణయించారు. ఇందులో ఒక్కో భవనం మరమ్మతు కోసం రూ.5లక్షలు కేటాయించారు. అలాగే ఫర్నీచర్ కొనుగోలు కోసం 30 కేంద్రాలు ఎంపిక చేయగా ఒక్కో కేంద్రానికి రూ.2.5లక్షలు నిధులు మంజూరు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దె పెంపు

ప్రస్తుతం పెరుగుతున్న ఖర్చులను దృష్టిలో ఉంచుకుని అంగన్‌వాడీ కేంద్రాలకు గత ఏడాది అక్టోబరు నెల నుంచి ప్రభుత్వం అద్దె పెంపు చేసింది. జిల్లా వ్యాప్తంగా 3,358 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటిలో అర్బన్ పరిధిలో 318 కేంద్రాలు, రూరల్ పరిధిలో 2, 581 కేంద్రాలు, ట్రైబల్ ఏరియా పరిధిలో 459 కేంద్రాలు ఉన్నాయి. వీటిలో చాలా వరకూ అద్దె ప్రాతిపదికన నడుస్తున్నాయి. అలా నడిచిన కేంద్రాలకు రూరల్‌లో ఉన్న కేంద్రాలకు అయితే రూ.వెయ్యి, అర్బన్ పరిధిలోని కేంద్రాలకు రూ.3వేలు అద్దె చెల్లించేవారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం గత ఏడాది అక్టోబరు నెల నుంచి రూరల్ పరిధిలోని కేంద్రాలకు రూ.వెయ్యి నుంచి రూ.3వేలకు, అర్బన్ పరిధిలోని కేంద్రాలకు అయితే రూ.3వేలు నుంచి రూ.6వేలకు పెంచారు.

త్వరితగతిన నిర్మాణ పనులు



జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ నిర్మాణాలు త్వరితగతిన జరుగుతున్నాయి. ఇవి పూర్తయితే అంగన్‌వాడీ కేంద్రాలు ద్వారా చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు మరింత నాణ్యమైన సేవలు అందించగలుగుతాం. పాతభవనాలకు మరమ్మతులు, ఫర్నీచర్ కొనుగోలు కూడా చేపడుతున్నాం. – కె.అనంతలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ

పీసీఎంఏ అధ్యక్షుడిగా మల్లా సురేష్ ఎన్నిక



మాట్లాడుతున్న నూతన కార్యవర్గ ప్రతినిధులు మల్లా సురేష్, రవికాంత్, శివకృష్ణ

కాశీబుగ్గ: వైఎస్సార్ హయాంలో పలాసలో జీడి పరిశ్రమలు అభివృద్ధి చెందాయని, ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనూ అనేక ప్రోత్సాహకాలు అందజేశారని పలాస కాష్యూ మాన్యుఫాక్చరర్ ఆఫ్ అసోసియేషన్ (పీసీఎంఏ) నూతన అధ్యక్షుడు మల్లా సురేష్ అన్నారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని సంఘ కార్యాలయంలో ఆదివారం కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షునిగా మరోసారి సురేష్‌నే ఎన్నుకోగా, కార్యదర్శిగా కె.వి.శివకృష్ణ, కోశాధికారిగా పట్నాన రవికాంత్‌లను రెండేళ్ల కాలపరిమితికి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలాస పరిసర ప్రాంతాల్లో 80 ఎకరాలలో ప్రభుత్వం నూతన పారిశ్రామికవాడ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కరోనా సమయంలోనూ జీడికి మద్దతు ధర అందేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో 160 మందికి పైగా సభ్యులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో మెరిసిన అక్కాచెల్లెళ్లు



కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

హిరమండలం: అంతర్జాతీయ కరాటే పోటీల్లో హిరమండలం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆరో తరగతి చదువుతున్న కవలలు టీ.గీతశ్రీ, గుణశ్రీ ప్రతిభ కనబరిచి తృతీయ స్థానంలో నిలిచారని కేజీబీవీ ప్రత్యేక అధికారి ఎస్.కృష్ణవేణి తెలిపారు. విశాఖ పట్టణం స్వర్ణభారతిలో 6వ అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్–2023 పోటీలు జరుగుతున్నాయి. ఇందులో భారత్, నేపాల్, బూటాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, సౌత్ అరేబియా దేశాలు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో భాగంగా హిరమండలం కేజీబీవీ నుంచి అండర్–11 కేటగిరీలో గీతాశ్రీ, గుణశ్రీలు పాల్గొని మూడో స్థానంలో నిలిచారు. వీరితో పాటు కరాటే మాస్టర్ సింహాచలంను ఎస్‌ఓ కృష్ణవేణి, ఉపాధ్యాయినులు అభినందించారు.

సామాజిక పురోగమనమే అభ్యుదయం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: వివక్షకు తావులేకుండా సమాజాన్ని ముందుకు నడిపించడమే అభ్యుదయమని ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు అన్నారు. ఆ ఆశయంతోనే 80 ఏళ్లుగా అభ్యుదయ రచయితల సంఘం(అరసం) సాహిత్యం ద్వారా కృషి చేస్తోందని చెప్పారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని క్రాంతి భవన్‌లో నిర్వహించి అరసం జిల్లా మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై కళింగాంధ్రా నవలలపై మాట్లాడారు. బలివాడ కాంతారావు, గండికోట బ్రహ్మాజీరావు, రావిశాస్త్రి వంటి వారి రచనల్లో కళింగాంధ్రా వెనుకబాటుతనం, దోపిడీ, అమాయకత్వం, వలసలు, వర్తమాన స్థితిగతులను వివరించారు. అనంతరం కాలెండర్‌ను ఆవిష్కరించారు. అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి చింతాడ కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో జిల్లా అధ్యక్షులు నల్లి ధర్మారావు, దాసరి రామచంద్రరావు, గార రంగనాథం, చిట్టి వెంకటరావు, మరడాన శ్రీనివాసరావు, పేడాడ ధనుంజయరావు, బుసకల రంగారావు భాగవతార్, పత్తి సుమతి, సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాస్, తెరవే అధ్యక్షుడు యు.నాగేశ్వరరావు, ఇస్కఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు బి.శ్రీరామమూర్తి, విద్యాసంస్థల అధినేతలు డాక్టర్ జామి భీమశంకర్, డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు, జిల్లా అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి సనపల నర్సింహులు, అరసం ఉపాధ్యక్షురాలు డాక్టర్ జ్యోతిఫెడరిక్, జిల్లా కార్యదర్శి కలమట దాసుబాబు, జి.వి.నాగభూషణం పాల్గొన్నారు.

గృహ సారథులే సంక్షేమ వారధులు

- జగనన్న సచివాలయాల కన్వీనర్ల రీజనల్ కోఆర్డినేటర్ హర్షవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న జగనన్న సచివాలయాల కన్వీనర్ల రీజనల్ కోఆర్డినేటర్ హర్షవర్ధన్‌రెడ్డి, పక్కనే ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తదితరులు

టెక్కలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను.. చేపడుతున్న అభివృద్ధిని ప్రతి కుటుంబానికి తీసుకువెళ్లాల్సిన సైన్యం గృహ సారథులేనని జగనన్న సచివాలయాల కన్వీనర్ల రీజనల్ కోఆర్డినేటర్ హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. టెక్కలిలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అధ్యక్షతన గ్రామ సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లు, గృహ సారథులు, పంచాయతీ సర్పంచ్‌లు, నాయకులతో ఆదివారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వంలో 10 శాతం సంక్షేమాన్ని అందజేసి 90 శాతం ప్రచారం చేసుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పాలన దేశ వ్యాప్తంగా ప్రత్యేకంగా నిలుస్తోందన్నారు. గృహ సారథుల పరిధిలో గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, స్థానిక నాయకులు కలిసి ప్రతి కుటుంబాన్ని కలవాలన్నారు. గత టీడీపీ చేసిన మోసాలు, జగనన్న ప్రభుత్వం చేసిన మంచిని వివరించాలన్నారు. సంక్షేమ పథకాలు నిరంతరం అందాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టాలని కోరాలన్నారు. 2024 ఎన్నికల్లో టెక్కలి నియోజకవర్గం నుంచి దువ్వాడ శ్రీనివాస్‌ను గెలిపించేలా సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడుతూ టెక్కలి నియోజకవర్గంలో అచ్చెన్నాయుడు సొంత గ్రామం నిమ్మాడలో 122 ఇళ్ల పట్టాలు, 72 పింఛన్లు అందజేశామని చెప్పారు. తమ హయాంలో చేసిన మంచిని వివరించేందుకు సిద్ధంగా ఉన్నామని.. టీడీపీ పాలనలో కక్షపూరిత చర్యలు చేపట్టలేదని చెప్పగలరా అని దువ్వాడ సవాల్ విసిరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దువ్వాడ వాణి, ఎంపీపీ ఎ.సరోజనమ్మ, మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత, వైస్ ఎంపీపీ ఎం.కిషోర్, మాజీ ఎంపీపీ టి.జానకిరామయ్య, నాయకులు చింతాడ గణపతి, బి.హరి, డి.కృష్ణారావు, జేఎస్‌సీ కన్వీనర్ల ఇన్‌చార్జి ఎస్.మోహన్, ప్రత్యేక ఆహ్వానితుడు ఎన్.శంకర్, సర్పంచ్‌లు జి.మోహన్‌రెడ్డి, ఎం.శంకర్, కె.కామేష్, ఎల్.సంజీవరావు తో పాటు బి.దేవయాని, పి.అప్పలనాయుడు, బి.రమేష్, పి.రమణబాబు, బి.గోపాల్, బి.ధనుంజయ్, యు.విశ్వనాథం, పి.వైకుంఠరావు, తవిటయ్య, శ్రీనివాస్, బి.రాజు, ఆర్.మురళీరెడ్డి, డి.కామన్న, బైరాగి, సిమ్మన్న, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుని మార్గం అనుసరణీయం



బుద్ధుని విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న విశాఖ పోలీస్ కమిషనర్ శ్రీకాంత్, ఇన్‌కమ్ టాక్స్ కమిషనర్ సత్యనారాయణరాజు

కొత్తూరు: గౌతమ బుద్ధుడు ఈ యుగానికే స్ఫూర్తి ప్రదాత అని కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ టాక్స్ బి.సత్యనారాయణరాజు (ఐఆర్‌ఎస్) అన్నారు. కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1989–90 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన బుద్ధుని విగ్రహాన్ని విశాఖ పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్(ఐపీఎస్)తో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరాజు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులంతా కలిసి విగ్రహం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బుద్ధుని ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో ఎస్పీగా పనిచేశానని, ఇక్కడ బుద్ధుడి విగ్రహం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ బి.శ్రీధర్, కొత్తూరు ప్రభుత్వ కాలేజీ ప్రిన్సిపాల్ బండారి రవికుమార్, తొలి ప్రిన్సిపాల్ ఎద్దు గోపాలదాసునాయుడు తదితరులు పాల్గొన్నారు.


భక్తిశ్రద్ధలతో సిరిజ్యోతి పూజలు



బలగలోని నాగావళి నదీతీరంలో బాల త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో మాఘపౌర్ణమి సందర్భంగా ఆదివారం శ్రీచక్ర రూపేణ సిరిజ్యోతి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో అమ్మవారికి ఉదయం అభిషేకాలు, అర్చనలు చేయగా.. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు. – శ్రీకాకుళం కల్చరల్



లేఖ రచన పోటీల్లో సిక్కోలు విద్యార్థి ప్రతిభ



టి.తేజ

శ్రీకాకుళం న్యూకాలనీ: తపాలా శాఖ నిర్వహించిన లేఖ రచన పోటీల్లో శ్రీకాకుళం నగరంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న టి.తేజ రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలిచి శభాష్ అనిపించాడు. గత ఏడాది అక్టోబర్‌లో తపాలా శాఖ విజన్ ఫర్ 2047 అనే అంశంపై 'ధాయ్ అఖర్' పేరుతో లేఖా రచన పోటీని నిర్వహించింది. తేజ రాసిన లేఖ తొలుత జిల్లా స్థాయిలో ఎంపికై రాష్ట్ర స్థాయి పరిశీలనకు వెళ్లింది. అమరావతిలోని రాష్ట్ర స్థాయి కమిటీ అన్ని జిల్లాల నుంచి వచ్చిన 36 లేఖలను పరిశీలించింది. అందులో అత్యద్భుతంగా లేఖలు రాసిన మొదటి ముగ్గురు విద్యార్థుల్లో ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థి టి.తేజ మొదటిస్థానంలో నిలవడంతోపాటు ట్రోఫీ, రూ.25వేల నగదు బహుమతికి ఎంపికయ్యాడు. సిక్కోలు విద్యార్థి రాష్ట్రస్థాయిలో మొదటిస్థానంలో నిలవడం పట్ల సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ సత్యనారాయణ ప్రత్యేకంగా అభినందించారు. ఆక్స్‌ఫర్డ్ స్కూల్ డైరెక్టర్ అన్నెపు లావణ్యారాణి, ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది ఆనందం వ్యక్తంచేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



నగదు అందిస్తున్న రామరాజు దంపతులు

కొత్తూరు: మండలంలోని గూనభద్ర ఆర్ఆర్ కాలనీ(పాడలి)లో శ్రీవన మహలక్ష్మి దేవి ఆలయ నిర్మాణానికి అదే కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు పల్లి రామరాజు దంపతులు విగ్రహం కోసం రూ.లక్షను ఆదివారం అందజేశారు. దాతలకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.